లక్ష్మీగణపతి ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు


పుష్పలంకరణలో అమ్మవారు

చందానగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేకపూజలు చేశారు. భ్రమరాంబ దేవికి అభిషేక, అర్చనలు నిర్వహించి, హోమం చేశారు. అనంతరం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ యూవీ రమణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

కనులపండువగా నృసింహస్వామి దివ్య కల్యాణం


పుష్పాలంకరణతో స్వామివారి దర్శనం

భెల్‌కాలనీ, మే 23 (ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వర, యేగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిత్యపూజలతో పాటు విశేష హోమాలు వైభవంగా జరిగాయి. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విశేష హోమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో పుష్పమండపంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్యకల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగించారు.

సెల్లార్‌గుంతల తవ్వకాలు నిలిపివేయాలి

చందానగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో కొందరు భవన నిర్మాణ దారులు సెల్లార్ గుంతలను పెద్దపెద్దభవనాల మధ్యలో తవ్వుతున్నారు. వర్షం పడితే భవనాలు దెబ్బతిని ఆస్తి, ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, తవ్వకాలు నిలిపివేయాలని ప్రజల కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మల్లారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ చందానగర్ నుంచి అమీన్‌పూర్‌కు వెళ్లే మార్గంలో సెల్లార్ గుంతల తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నిలిపివేయాలని కోరారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తాం : కార్పొరేటర్

మియాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ బాలాజీనగర్ కాలనీలో బాలాజీ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, దీపకాలనీ వాసులు కాలనీలో పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మియాపూర్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ బాలాజీ అపార్ట్‌మెంట్స్‌లో డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. దీపకాలనీలో వరదనీటి కాలువ, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే గాంధీ సహకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కౌస్తుబ్‌శర్మ, రాజశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్, చైతన్య, నాగబాబు, ఉమాశంకర్, నరేంద్ర, దీపకాలనీ వాసులు కోటయ్య, పద్మనాభయ్య, మురళీ, రమేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో బస్సు బోల్తా

- ఇద్దరు బాలికలు దుర్మరణం
- 15 మందికి తీవ్ర గాయాలు


మృతి చెందిన చిన్నారులు గోవర్ధిని, లక్ష్మి (ఫైల్)

కోడుమూరు (రూరల్), మే 23: ప్రైవేట్ బస్సు బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరు బాలికలు మృతిచెందారు. మరో 15 మంది తీవ్రంగా, 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. బిస్మిల్లా ట్రావెల్స్‌కు చెందిన బస్సు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఆదోనికి బయలుదేరింది. కోడుమూరు మండలం ప్యాలకుర్తి స్టేజీ దాటాక ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి కొద్దిగా ముందుకెళ్లాక బస్సు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. హైదరాబాదులోని బాలానగర్‌లో ఉంటున్న కృష్ణవేణి ఇంటర్ ఒకేషనల్ పరీక్ష రాయడానికి ఆదోనికి వెళ్తోంది. ఆమె వెంట వస్తున్న బాబాయి కుమార్తె లక్ష్మి(13), అన్న కుమార్తె గోవర్ధని(7) ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ బాలనరసింహులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను తీయించారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కళా విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుంది


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి, శంకరనారాయణ

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కళా విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుందని, జీవితాలను కాపాడుతుందని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రచయిత అంజన గోలి(అమెరికా) రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ ఆంగ్ల వ్యాస సంపుటి గ్రంథావిష్కరణ కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు సంపుటిని విశ్లేషణ చేశారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

దుండిగల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి రవాణాశాఖ అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. మేడ్చల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు, శిక్షణా సిబ్బందితో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలి : డీసీ

కుత్బుల్లాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): చెత్తను విధిగా స్వచ్ఛ ఆటోల్లోనే వేసేవిధంగా పొదుపు గ్రూపు సభ్యులు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆర్పీలు చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ వి.నర్సింహ అన్నారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈసమావేశంలో వైద్యాధికారి డాక్టర్ భార్గవనారాయణ, డిప్యూటీ ప్రాజెక్టు అధికారి హిమబిందు పాల్గొన్నారు.

గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

చందానగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి తీసుకువెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 950 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లను చందానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుల్‌మొహర్‌పార్కు సమీపంలోని బాపునగర్‌లో నివాసం ఉండే సయ్యద్‌ఇమ్రాన్(23) పటాన్‌చెరు ఆర్‌సీపురంలో పాన్‌షాపు నడుపుతున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన యనమల మహేష్(19) ఖైరతాబాద్‌లోని ఎల్లమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ గుల్‌మొహర్‌చౌరస్తా నుంచి బ్యాగులో గంజాయి తీసుకువెళ్తున్నారు. అక్కడే వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని బ్యాగులను చెక్‌చేయగా 950గ్రాముల గంజాయిని గుర్తించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం


విద్యార్థి సంజీవ్‌కుమార్

మియాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి కళాశాలకు అని బయలుదేరిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల్‌కు చెందిన తిరుమలేష్ కుమారుడు సంజీవ్ కుమార్ పటాన్‌చెరులోని రెసొనెన్స్ కళాశాలలో చదువుతున్నాడు. ఈనెల 22న ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరాడు. కానీ కళాశాలకు కానీ, హాస్టల్‌కు కానీ రాలేదని కళాశాల నిర్వాహకులు తండ్రికి తెలిపారు. దీంతో స్నేహితులు, తెలిసిన వారిని విచారించగా మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద చూసినట్లు చెప్పారు. దీంతో సంజీవ్‌కుమార్ తండ్రి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణ.. 60 గజాల చొప్పున విక్రయం

- నిజాంపేటలో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అమ్మకాలు
- ఆ స్థలాల్లో నిర్మాణాలను తొలగించాలని బీజేపీ నాయకుల ఫిర్యాదు


సర్వేనంబర్ 346 భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలు


సర్వేనంబర్ 334 భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలు

నిజాంపేట్, మే 23(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సర్వే నంబర్ 334లో 8 ఎకరాలు, 346లో 4 ఎకరాలను కొంత మంది కబ్జాదారులు ఆక్రమించుకొని 60 గజాల చొప్పున ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారు. కనీస అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ గురువారం బాచుపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. సర్వే నంబర్ 334లో దాదాపు 8 ఎకరాల ప్రభుత్వ భూమి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చిన్న చిన్న ప్లాట్లుగా చేయడమే కాకుండా ఒక్కో ప్లాటుకు రూ.15 లక్షల నుంచి రూ20 లక్షల వరకు పేదప్రజలకు అమ్ముకుంటున్నారని సతీష్ చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి చేరాల్సిన కోట్లాది రూపాయల నిధులు కబ్జాదారులకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల నుంచి వరుస ఎన్నికల నేపథ్యంలో 334 సర్వేనంబర్‌లో రోజూ పదుల సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి చెప్పారు. దీనికితోడు 346 సర్వేనంబర్‌లో తుర్కచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో కూడా నిర్మాణాలు సాగుతున్నాయి. అధికారులు ఈ సర్వే నంబర్లపై సమగ్ర దృష్టి సారించి, కచ్చితమైన వివరాలు సేకరించి, ఆ నిర్మాణాలను తొలగించి, భూములను స్వాధీనం చేసుకోవాలని సతీష్ అధికారులను డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా చేసుకొని విక్రయాలకు పాల్పడుతున్న వివిధపార్టీల నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఆ భూములను ప్రజావసరాలకు కేటాయించాలని సతీష్ కోరారు.

బుద్ధుడి అహింసామార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలి

జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్


ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కాపు సేవా సమితి నాయకులు

బాలానగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సమస్త లోకానికి సత్యం, శాంతి ధర్మ సిద్ధాంతాన్ని బోధించిన గౌతమ బుద్ధుడి అహింసామార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కూకట్‌పల్లి జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ సూచించారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా బాలానగర్ కాపుసేవాసమితి అధ్యక్షుడు దొండపాటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో బాలానగర్ శోభనాకాలనీ రోడ్‌నెంబర్-2 కాళికాదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్నీ ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు ప్రేమ్‌కుమార్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బోగాది వెంకటేశ్వర్‌రావు, కొల్లా శంకర్, కలిగినిడి ప్రసాద్, ఆడబాల షణ్ముక్, మారుతి, పులగంసుబ్బు, సేవా సమితి సభ్యులు పి.నాగేశ్వర్‌రావు, జేపీఎస్.రావు, వీరాంజనేయులు, పవన్, సురేశ్, కిరణ్‌కుమార్, స్వామి నాయుడు, రాంబాబు, దేవ చంద్రరావు, శ్రీను, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు

- కారు బోల్తా.. భార్య మృతి, భర్త పరిస్థితి విషమం
- ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు


బోల్తా కారు


మృతిచెందిన రేఖప్రియాంక

తిప్పర్తి, మే 23: కుటుంబ సమేతంగా దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా పడి భార్య మృతిచెందింది. భర్త పరిస్థితి విషమంగా ఉంది. గురువారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన చలువాది వెంకట శివ(33), ఆయన భార్య రేఖప్రియాంక(31) ఇద్దరూ సాఫ్ట్‌వేర్‌ఉద్యోగులు. తమ కుమారులు నిక్షిత్(6), తేజ్‌వర్ధన్(3)తో కలిసి దైవదర్శనం నిమిత్తం ఈ నెల 21న తిరుపతి బయలుదేరారు. సొంత కారుకు హైదరాబాద్‌కు చెందిన కడియపుడి మహేంద్రను డ్రైవర్‌గా మాట్లాడుకున్నారు. దర్శనం అనంతరం బుధవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలోని పోలీ‌స్‌స్టేషన్ దాటిన తర్వాత గురువారం తెల్లవారుజామున డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న రేఖప్రియాంక అక్కడికక్కడే మృతిచెందింది. వెంకటశివ, ఇద్దరు కుమారులు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటశివను గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, మే 23 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ ఉషా ముళ్లపూడి, శ్రీరామ్‌నగర్, 11కేవీ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించేందుకు నేడు ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు అంబేడ్కర్‌నగర్, భవానీనగర్, ఉమాదేవి నగర్, శ్రీనివాస్‌నగర్, చిత్తామర్మ దేవినగర్, మల్లారెడ్డినగర్, సంస్కృతి ఎన్‌క్లేవ్, ఉషోదయ కాలనీ ఫేజ్-2, చంద్రగిరినగర్, మధ్యాహ్నం 2.30 నుంచి 4గంటల వరకు శ్రీరామ్‌నగర్ ఫీడర్‌ల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- **కూకట్‌పల్లి:** 11కేవీ ఏఎస్.రాజునగర్, ఈనాడుకాలనీ, సప్తగిరి కాలనీ ఫీడర్ల పరిధుల్లో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చైతన్య తెలిపారు. వివేకానందనగర్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు, ఏఎస్.రాజునగర్‌లో ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు, ఈనాడుకాలనీలో మధ్యాహ్నం 1:30గంటల నుంచి 3 వరకు, వివేకానందనగర్‌కాలనీలోని ప్లాట్‌నంబర్ 136, వడ్డేపల్లి నర్సింగ్‌రావు ఇంటి సమీపంలో 3:30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- **హైదర్‌నగర్:** జేఎన్‌టీయూ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, ఈడబ్ల్యుఎస్ రోడ్డు, పోస్టాఫీస్, చాకలిడబ్బా, శివాలయం రోడ్డు, మహారాష్ట్ర బ్యాంకు ఎదురుగా, గ్లోబల్ స్కూల్ రోడ్డు, ఎల్ఐజీ-302 నుంచి 384, ధనలక్ష్మీ సెంటర్ ప్రాంతంలో విద్యుత్ ఉండదన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ధర్మారెడ్డిపార్కు, ఐసీఐసీఐబ్యాంకు, పూజ ఎలక్ట్రికల్ షాపు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.
- **మియాపూర్:** జేపీఎన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు నాగార్జున ఎన్‌క్లేవ్, జేపీఎన్‌నగర్, ఫేజ్-1, 2లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు లక్కీరెస్టారెంట్ వెనుక ప్రాంతం, బాలాజీనగర్, దత్తసాయినగర్, శ్రీరంగపురం, అరబిందోకాలనీ, జేపీఎన్‌నగర్ మెయిన్‌రోడ్డులో విద్యుత్ ఉండదన్నారు. 3.30 నుంచి 5 గంటల వరకు హెచ్ఎంటీ మక్తా, హెచ్ఎంటీ కాలనీ, పీఎనగర్, రెయిన్‌బో వెంచర్‌లో విద్యుత్ ఉండదన్నారు.
- **అల్లాపూర్:** చెట్ల కొమ్మల ట్రిమింగ్ పనుల కారణంగా అల్లాపూర్‌లోని పలు కాలనీలలో శుక్రవారం విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. 11 కేవీ గాయత్రి నగర్ ఫీడర్ (33బై11 కేవీబోరబండ) పరిధిలోని గాయత్రి నగర్ పార్కు, హరిహర దేవాలయం, పద్మావతి హోటల్ ఎదురుప్రాంతంలో ఉదయం11:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని అధికారి పేర్కొన్నారు.
- **రాయదుర్గం :** కోమరంబీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి 1గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. టీఎన్‌జీఓ కాలనీ ఫేజ్-1, 2లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు నానక్‌రాంగూడ, 3.30 నుంచి 5 గంటల వరకు టీఎస్ఐఐసీ, ఎంఆర్‌ప్రాపర్టీస్, నానక్‌రాంగూడలోఉండదన్నారు.
- లేక్‌వ్యూ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు డీమార్ట్ వెనుక ప్రాంతం, నల్లగండ్ల కమ్యూనిటీహాల్, సైబర్‌లైఫ్‌లో విద్యుత్ ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సాధన స్కూల్ వెనుక ప్రాంతం, ఏపీస్టోన్, గ్లోబల్ స్కూల్, రాక్‌పార్కు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.


లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం నాయకులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ఆలయాల అభివృద్ధికి ముందుంటా : కూన

గాజులరామారం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తాను ఎప్పుడూ ముందుంటానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని నల్లగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి జయంతి సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేన గుప్త, యాదగిరి, శ్రీనివాస్, రాములు, సురేష్ పాల్గొన్నారు.


మూసాపేటలోని వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకొంటున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేటలో కాంగ్రెస్ నాయకుడు చున్ను పాషా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బండి రమేష్ ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. వారంరోజుల పాటు కొనసాగే ఈ వైద్య సేవలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డా.మహ్మద్ మున్నీ, నాయకులు వేణు, శ్రీను, తూము సంతోష్, మల్లేష్‌యాదవ్, మహేష్‌గౌడ్, నయాం, మోసిన్, జోజమ్మ తదితరులు పాల్గొన్నారు.